PJ NEWS

www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

PRGI NO : TGTEL/25/A1872

సంగారెడ్డి , హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 178 | శనివారం | 03 - 01 - 2026 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 08 | వెల: 5/-




# 70వేల జనాభాకు రక్షణ ఎక్కడ..?

## 40ఏళ్ళ బొల్లారం పోలీస్ స్టేషన్ రద్దు పై ప్రజా ఆగ్రహం

**- మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి నాయకత్వంలో ఘాటైన నిరసన**

- **బొల్లారాన్ని రక్షణ లేని ప్రాంతంగా మార్చారా..?**
- **40 ఏళ్ల పోలీస్ స్టేషన్ రద్దుపై ప్రజాగ్రహం రోడ్డెక్కిన బీఆర్ఎస్**
- **సామాన్యుడు న్యాయం కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి**
- **ఫిర్యాదు ఇవ్వాలంటే పరిగెత్తాల్సిన పరిస్థితి**
- **వలస కార్మికులు పోలీస్ స్టేషన్ దాకా వెళ్లే ధైర్యం కోల్పోతారు**

**అస్త్రం , బొల్లారం :** బొల్లారం జిహెచ్ఎంసి డివిజన్ 272 పరిధిలోని ఐడీఏ బొల్లారం ప్రాంతాన్ని రక్షణ లేకుండా చేస్తున్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన బొల్లారం పోలీస్ స్టేషన్‌ను రద్దు చేసి అమీన్పూర్ పోలీస్ సర్కిల్‌లో విలీనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, గాంధీ బొమ్మ సమీపంలో శుక్రవారం భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి నాయకత్వం వహించగా, బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజా భద్రతను పక్కనపెట్టి తీసుకున్న ఈ నిర్ణయం బొల్లారానికి తీవ్ర అన్యాయం అని నిరసనకారులు మండిపడ్డారు.

**70 వేల జనాభాకు పోలీస్ రక్షణ కరువా..?**

బొల్లారం పరిధిలో సుమారు 25 కాలనీలు, 70 వేలకుపైగా జనాభా, 350కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. అంతేకాదు, ఇక్కడ 80 శాతానికి పైగా వలస కుటుంబాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు నివసి




స్తున్నారని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేశారు. ఇలాంటి సున్నితమైన ప్రాంతంలో పోలీస్ స్టేషన్ తొలగించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని వారు ఆరోపించారు. ఒక పక్క సైబరాబాద్ కమిషనరేట్లో కలపడాన్ని స్వాగతిస్తూ పోలీస్ స్టేషన్ ను తిసేయడాన్నే వ్యతిరేకిస్తున్నామన్నారు.

**పిర్యాదు ఇవ్వాలంటే పరిగెత్తాల్సిందే ..**

పోలీస్ స్టేషన్ విలీనంతో చిన్న ఫిర్యాదు నుంచి పెద్ద కేసు వరకు ప్రతిదానికీ అమీన్పూర్ పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మహిళలు, కార్మికులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పుడు న్యాయం కోరడానికి వెనకడుగు వేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి: కొలన్ బాల్ రెడ్డి**

ఈ సందర్భంగా మాట్లాడిన జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి మాట్లాడుతూ "40 ఏళ్లుగా ప్రజలకు రక్షణగా ఉన్న బొల్లారం పోలీస్ స్టేషన్‌ను ఎత్తివేయడం అన్యాయం. ఐడీఏ బొల్లారంలో వెంటనే పోలీస్ స్టేషన్‌ను పునరుద్ధరించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజాభద్రతపై పునరాలోచన చేయాలని, బొల్లారం పోలీస్ స్టేషన్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, బొల్లారం మాజీ కౌన్సిలర్లు వి. వేణుపాల్ రెడ్డి, టీ. సాయి కిరణ్ రెడ్డి, బీరప్ప యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు బి. జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రత్నం, యాదగిరి, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బొల్లారం పోలీస్ స్టేషన్ - సామాన్యుడికి న్యాయం చేసిన కేంద్రం**

బొల్లారం పోలీస్ స్టేషన్ అంటే కేవలం కేసులు నమోదు చేసే కార్యాలయం కాదు సామాన్యుడికి న్యాయం అందించిన నమ్మక స్థానం. గత నాలుగు దశాబ్దాలుగా కార్మికుల జీతాల సమస్యలు మహిళలపై వేధింపుల కేసులు, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, భూ వివాదాలు, అక్రమ కబ్జాలు, వలస కార్మికులపై దాడులు, పరిశ్రమల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఇలాంటి వందలాది ఘటనల్లో బొల్లారం పోలీసులు వెంటనే స్పందించి న్యాయం చేశారు. ప్రాంతం చిన్నదైనా పోలీసుల స్పందన వేగంగా ఉండటం వల్ల నేరగాళ్లలో భయం ప్రజల్లో భరోసా ఎప్పుడూ ఉండేది.



**పోలీస్ స్టేషన్ లేకపోతే భద్రత ఎవరిది..?**

బొల్లారం ప్రాంతంలో 80 శాతానికి పైగా వలస కుటుంబాలు పరిశ్రమలలో రాత్రి పగలు షిఫ్టులు ఇలాంటి చోట పోలీస్ స్టేషన్ లేకపోతే మహిళల భద్రత ఏమవుతుంది? , కార్మికుల ప్రాణాలకు హామీ ఎక్కడ?, నేరాలు పెరిగితే బాధ్యత ఎవరిది?.ప్రభుత్వ నిర్ణయంతో బొల్లారం ప్రజలు రక్షణ లేని ప్రాంతంలో జీవించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

**ఇది పరిపాలనా మార్పు కాదు – ప్రజా భద్రతపై దెబ్బ**

పోలీస్ స్టేషన్‌ను మూసేయడం ఒక ఫైల్‌పై సంతకం పెట్టడం అంత సులువు కాదు. దాని వెనుక వేలాది ప్రజల భద్రత, నమ్మకం, నిశ్చింత దాగి ఉంటాయి. 40 ఏళ్లుగా బొల్లారం ప్రజలకు రక్షణగా నిలిచిన పోలీస్ స్టేషన్‌ను ఒక్క నిర్ణయంతో తొలగించడం ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై అవగాహన ఉందా? అనే సందేహాన్ని కలిగిస్తోంది. 70 వేల జనాభా ఉన్న ప్రాంతానికి 350 పరిశ్రమలు ఉన్న ప్రాంతానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు నివసించే ప్రాంతానికి పోలీస్ స్టేషన్ అవసరం లేదని చెప్పడం ప్రజల వాస్తవ పరిస్థితులను విస్మరించిన నిర్ణయమే. ఒక ఘటన జరిగితే పోలీసులు నిమిషాల్లో చేరాలా? లేక కిలోమీటర్ల దూరం నుంచి రావాలా? ఆ ఆలస్యం ఎవరి ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందో ప్రభుత్వం ఆలోచించిందా? భద్రత లేకపోతే పరిశ్రమలు నిలబడవు ఉపాధి దెబ్బతింటుంది. ప్రజల్లో పాలనపై నమ్మకం కూలిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ఐడీఏ బొల్లారంలో పోలీస్ స్టేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలి. లేదంటే ఇది కేవలం రాజకీయ ఉద్యమంగా కాక ప్రజా ఉద్యమంగా మారడం ఖాయం.

**- ఎడిటర్ : జయరాం**

www.epaper.asthram.com

సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శనివారం 3 జనవరి 2026

సంగారెడ్డి సంచిక : 178 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## 2025లో రూపాయి 4.7 శాతం పతనం

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ వరుసగా రెండో నెలలోనూ పతనమయ్యింది. డిసెంబరులోనూ నష్టంతో ఈ ఏడాదిని ముగించింది. చివరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారత దేశ చరిత్రలోనే 91 స్థాయిని దాటి ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.87 వద్ద ముగిసింది. ఈ నెలలో స్థూలంగా 0.5 శాతం విలువ కోల్పోయింది. 2025 ఏడాదిలో మొత్తంగా రూపాయి విలువ 4.7 శాతం క్షీణించింది. ఇది గత మూడేళ్లలో నమోదైన అతిపెద్ద వార్షిక పతనం కావడం ఆందోళనకరం. ఈ ఏడాది పొడవునా రూపాయిపై ప్రభావం చూపిన అంశాలే డిసెంబరులోనూ కొనసాగాయి.



## నీరు కాదు విషాన్ని పంచారు

- ఇందౌర్‌లో మరణాలపై రాహుల్ ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోంది
- కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొంది
- పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు

# మూసీకి మహర్దశ

- రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు. ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా–ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'ఏ' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత - మిగతా3లో

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

- కవిత ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్నారా లేదా అనే విషయం వెల్లడించాలన్న మంత్రి
- కేసీఆర్‌ను విమర్శిస్తే స్పందించిన కవిత, హరీశ్ రావుపై విమర్శలకు స్పందించలేదని వ్యాఖ్య
- కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా కవిత ఉన్నారన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్

కవిత ప్రస్తుతం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులందరినీ దూరం చేసే ధోరణిలో మాట్లాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రోజూ అసెంబ్లీకి వస్తే బీఆర్‌ఎస్ పుంజుకుంటుందన్న కవిత వ్యాఖ్యలు ఆమె రాజకీయ భవిష్యత్తను ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నారో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత చేసిన - మిగతా3లో



## ఇక సమయం వచ్చింది

- భారత్ మద్దతు కోరిన బలూచ్ ప్రతినిధి
- విదేశాంగ మంత్రి జైశంకర్‌కు బలూచ్ నేత మీర్ యార్ బలూచ్ బహిరంగ లేఖ
- బలూచిస్థాన్‌లో కొద్ది నెలల్లో చైనా సైన్యాన్ని మోహరిస్తారని హెచ్చరిక
- పాకిస్థాన్ అణచివేతకు వ్యతిరేకంగా భారత్ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- 79 ఏళ్లుగా పాక్ అకృత్యాలకు పాల్పడుతోందని లేఖలో ఆరోపణ
- ఈ లేఖపై భారత్, పాకిస్థాన్, చైనాల నుంచి ఇంకా అధికారిక స్పందన

## వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు

తనకు వారాంతపు సెలవులు ఉండవన్న జైశంకర్

సంగీతం, పుస్తకాలు తనకు ప్రశాంతతను ఇస్తాయని వ్యాఖ్య

డిటాక్స్ కావాల్సిన అవసరం తనకు లేదన్న జైశంకర్



## మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు

- షేర్వాణీలు వేసుకుని వస్తే మీరు బెల్లు కొట్టడం లేదు: అసెంబ్లీలో నవ్వులు పూయించిన బీజేపీ ఎమ్మెల్యే
- మేం కూడా షేర్వాణీ వేసుకుని వస్తామని ప్రభుత్వానికి చురక
- కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని సీఎం చెప్పారని గుర్తు చేసిన ఎమ్మెల్యే



హైదరాబాద్

బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అధ్యక్షా, మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు. కానీ మా పక్కనున్న షేర్వాణీ వేసుకున్న మిత్రులు మాట్లాడితే మాత్రం ఏ రోజు బెల్లు కొట్టలేదు. అలా అయితే మేమూ షేర్వాణీలు వేసుకుని వస్తాం" అంటూ సభలో హాస్యాన్ని పండించారు. కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని, - మిగతా3లో



## ఆర్థిక సంక్షోభం... ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

- ఇరాన్‌లో నిరసనకారుల పట్ల భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ ఆగ్రహం
- శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దన్న ట్రంప్
- వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరిక
- ట్రంప్ జోక్యంపై తీవ్రంగా స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ సీనియర్ సలహాదారు

# చైనా మాంజాతో ముంచుకొస్తున్న ప్రమాదం



- అప్రమత్తంగా లేకుంటే గాల్లోకి ప్రాణం!
- నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు
- ద్విచక్ర వాహనదారుల మెడకు చుట్టుకుని ప్రమాదం
- పక్షులకు కూడా తప్పని ముప్పు– ఈ సమయం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి
- ప్రమాదకరమైన వాటితో తయారైన మాంజా

హైదరాబాద్

జనవరి నెల వచ్చేసింది. ఇక అందరూ రానున్న సంక్రాంతి పండగ గురించి ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా సంక్రాంతి అనగానే పిల్లలకు ముందుగా గుర్తుకు వచ్చేది వాళ్లు ఎంతో సరదాగా ఎగురవేసే గాలిపటాలు. అందుకే జనవరి నెల మొదలవగానే గాలిపటాలతో పిల్లలు సిద్ధంగా ఉంటారు. అంతే కాకుండా గాలి పటాలను ఎగురవేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఎంతో సరదాగా ఆడుకునే ఈ ఆటలో ఇంకా ఎన్నో ప్రమాదాలు కూడా దాగి ఉన్నాయి. పండగ వేళల్లో సందడిగా ఉండాల్సిన కొందరి ఇళ్లు విషాదంగా మారుతున్నాయి. దానికి కారణం గాలిపటాలు ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా దారం. చైనా మాంజా పంజా విసురుతోంది. నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. చాలామంది వాటి బారిన పడుతున్నారు. మేడలు, అపార్ట్‌మెంట్లపైకి వెళ్లి పతంగులను ఎగురవేస్తుండగా - మిగతా3లో

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



ఏపీ, తెలంగాణ మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ

సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో పనిచేయనున్న నిపుణుల బృందం

గతేడాది జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం

కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్–2 గడువును పొడిగించిన కేంద్రం

పెండింగ్ ప్రాజెక్టులు, నీటి పంపిణీపై కమిటీ సమగ్ర అధ్యయనం

# వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు

వర్క్ – లైఫ్ బ్యాలెన్స్ అనే అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్నపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తాజాగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపైనే మాట్లాడే జైశంకర్ ఈసారి తన వ్యక్తిగత జీవన విధానం గురించి ఓపెన్‌గా చెప్పడం విశేషంగా మారింది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన జైశంకర్... తనకు మిగతా ఉద్యోగుల్లా వారాంతపు సెలవులు ఉండవని స్పష్టం చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు షెడ్యూల్ వేసుకుని పనిచేయడం తన వృత్తిలో సాధ్యం కాదన్నారు. అంతర్జాతీయ వ్యవహారాలకు టైమ్ టేబుల్ ఉండదని, ప్రపంచంలోని



దేశాలు వేర్వేరు టైమ్ జోన్లలో ఉండటంతో ఎప్పుడైనా పని చేయాల్సి వస్తుందని వివరించారు. తన రోజువారీ జీవితంలో కొన్ని అలవాట్లను పాటిస్తూ మానసిక ప్రశాంతతను పొందుతున్నానన్నారు. విశ్రాంతి కోసం సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం, క్రీడల్లో జరుగుతున్న విషయాలను తెలుసుకోవడం వంటి అలవాట్లు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ అలవాట్ల వల్ల ప్రపంచంతో అనుసంధానమై ఉండగలుగుతున్నానని, అదే తనకు వర్క్ – లైఫ్ బ్యాలెన్స్‌ను ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా బ్రేక్ తీసుకోవడం లేదా డిటాక్స్ కావాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్న జైశంకర్... ఈ విధానంతో తన జీవితం సహజంగానే కొనసాగుతోందన్నారు. అయితే ఈ అభిప్రాయాలు ఇంట్లో అందరికీ నచ్చవని నవ్వుతూ చెప్పారు. తన భార్య కూడా ఇక్కడే ఉన్నారని, ఈ విషయంపై ఆమె తనతో విభేదించే అవకాశం ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు సోషల్ మీడియాలోనూ చర్చకు దారి తీశాయి.

# ఆర్థిక సంక్షోభం... ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌లో నిరసనకారులపై అక్కడి భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దని, అలాంటి వారిని అమెరికా కాపాడుతుందని అన్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సీనియర్ సలహాదారుడు అలీ



లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంతమంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. తమ జాతీయ భద్రత రెడ్ లైన్ వంటిదని, దీనిని పరీక్షించాలనుకోవడం సాహసమే అవుతుందని అన్నారు. దేశంలో ధరలు పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్

అస్త్రం, అమీన్ పూర్



హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పాలనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ భేటీ హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సౌహార్దపూర్వక వాతావరణంలో జరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ గాలి అనిల్ కుమార్ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి కొత్త దిశను చూపుతోందని ఆయన ప్రశంసించారు. అలాగే ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంలో టీపీసీసీ అధ్యక్షుల పాత్ర కీలకమని గాలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం ప్రభావవంతంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతోనే ప్రజాప్రభుత్వ లక్ష్యాలను సాధించగలమని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ నాయకుల నుంచి వస్తున్న సహకారం ప్రభుత్వానికి మరింత బలం ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలలో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. రైతులు, యువత, మహిళలు, కార్మిక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ భేటీ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సంక్షేమంపై అనౌపచారికంగా చర్చ జరిగినట్లు సమాచారం. నూతన సంవత్సరం ప్రారంభంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## బొల్లారం పోలీస్ స్టేషన్ తరలింపు ఆపాలి

**డీజీపీకి ఎమ్మెల్సీ అంజి రెడ్డి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి వినతి**

అస్త్రం, బొల్లారం



బొల్లారం పోలీస్ స్టేషన్‌ను అమీన్ పూర్‌కు తరలించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, ఎమ్మెల్సీ అంజి రెడ్డి మరియు బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆనంద్ కృష్ణారెడ్డి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)కి వినతి పత్రం సమర్పించారు. బొల్లారం ప్రాంత ప్రజల భద్రత మరియు సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పోలీస్ స్టేషన్‌ను బొల్లారంలోనే కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. పోలీస్ స్టేషన్‌ను అమీన్‌పూర్‌కు తరలించడం వలన స్థానిక ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, ఇది శాంతిభద్రతల పర్యవేక్షణకు కూడా ఆటంకం కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజల ఆందోళనలను పరిగణలోకి తీసుకుని, పోలీస్ స్టేషన్ తరలింపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, బొల్లారంలోనే పోలీస్ సేవలు యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు డీజీపీని కోరారు. డీజీపీ మాట్లాడుతూ యథావిధిగా కొనసాగిస్తారని హామీ ఇవ్వడం జరిగింది. డిజిపి ని కలిసిన వారిలో టి.రవీందర్ రెడ్డి,భరత్ చారి, శ్రీకాంత్, యశ్వంత్, అఖిల్ ఉన్నారు.

## ఎన్‌ఎంఆర్ కి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన గుండ్ల మహేందర్ రెడ్డి

అస్త్రం, బొల్లారం:



మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి చిట్కూల్ గ్రామంలోని మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ కార్యాలయంలో నీలం మధు ముదిరాజ్ ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

# అరికేపూడి హయాంలో శిలాఫలకలే పరిమితమైన అభివృద్ధి జవహర్ కాలనీలో ప్రజల ఆగ్రహం

అస్త్రం, చందానగర్

శేరిలింగంపల్లి నియోజకవర్గం జవహర్ కాలనీలో ప్రజా నిధులతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శాసనసభ్యుడు అరికేపూడి గారి హయాంలో జవహర్ కాలనీలో పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి ఇరవై ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ప్రకటించి, కాలనీ వాసుల ఖర్చులతో టెంట్, పూల దండలు, శాలువాలు, కొబ్బరికాయలతో అంగరంగ వైభవంగా శిలాఫలకం ఏర్పాటు చేశారు.
అయితే శిలాఫలకం ఏర్పాటు చేసి ఇరవై ఐదు నెలలు పూర్తవుతున్నా, ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా వేయని దుస్థితి నెలకొంది. చెప్పులు అరిగేలా కాలనీ వాసులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా, పనులు మాత్రం ప్రారంభం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార వ్యామోహమే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై అరికేపూడి గాంధీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. శాసనసభ ఎన్నికల సమయంలో శిలాఫలకాలు పెట్టి, ఇప్పుడు మహానగర పాలక సంస్థ ఎన్నికల దృష్ట్యా మళ్లీ కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.
పనులు చేయకుండా కేవలం శిలాఫలకాలతోనే ప్రజల ఓట్లు దక్కించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆమె అన్నారు. కోట్లాది రూపాయల విలువైన పనులు ప్రారంభం కాకుండానే, శిలాఫలకాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఇకనైనా శిలాఫలకాల మాయలో పడకుండా వాస్తవాలను గుర్తించి



ఆలోచించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సలీం, చందర్ రావు, గౌస్, ప్రమోద్, అనంత రెడ్డి, సునీత, శబానా తదితరులు పాల్గొన్నారు.

## నీరు కాదు విషాన్ని పంచారు..



కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా.. విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా.. అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన భాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు.

**మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీనే కారణం: ఇండోర్ ఘటనలో కీలక విషయం**

దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శించారు. ఇక, ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరే షన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.

## 'ఇక సమయం వచ్చింది'



పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ బలూచ్ మానవ హక్కుల నేత మీర్ యార్ బలూచ్, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ తుది దశకు చేరుకోవడంతో, రాబోయే కొద్ది నెలల్లో బలూచిస్థాన్‌లో చైనా తన సైన్యాన్ని మోహరించే ప్రమాదం ఉందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా-పాకిస్థాన్ కూటమి భారత్, బలూచిస్థాన్ రెండింటికీ పెను ప్రమాదమని పేర్కొంటూ, ఈ సమస్యను సమూలంగా పెకిలించి వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎ' ద్వారా మీర్ యార్ ఈ లేఖను విడుదల చేశారు. "బలూచిస్థాన్ గడ్డపై చైనా సైనికులు అడుగుపెడితే, అది భారత్, బలూచిస్థాన్ భవిష్యత్తుకు ఊహించని ముప్పును కలిగిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. గత 79 ఏళ్లుగా పాకిస్థాన్ ఆక్రమణ, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం, దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనలతో బలూచ్ ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశానికి శాశ్వత శాంతి, సార్వభౌమత్వం లభించేందుకు ఈ సమస్యను మూలాలతో పెకిలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతేడాది (2025) పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మోదీ ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా తీసుకున్న సాహసోపేతమైన చర్యలను ఆయన ప్రశంసించారు. ఇది ప్రాంతీయ భద్రత పట్ల భారత నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. బలూచిస్థాన్‌లోని హింగ్లాజ్ మాత ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలను ప్రస్తావిస్తూ, భారత్-బలూచిస్థాన్ మధ్య ఉన్న పురాతన బంధాన్ని గుర్తుచేశారు. ఆరు కోట్ల బలూచ్ ప్రజల తరఫున శాంతి, వాణిజ్యం, రక్షణ, భద్రత వంటి రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, మీర్ యార్ బలూచ్ రాసిన ఈ లేఖపై ఇప్పటివరకు భారత్, పాకిస్థాన్, లేదా చైనా ప్రభుత్వాల నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్తున్నందున, సీపీఈసీ ప్రాజెక్టును భారత్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకు పొడిగించింది.

# కవితకు ఓటు... ఎవరికి చేటు...



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చే ముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక సారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు. కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇది కేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ×4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అది నేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్ద సమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగా మారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్



**హైదరాబాద్ :** భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్లు దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.

వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి

మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్-2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ.

2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది. ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది.

వేసవి సన్నాహాలు

గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకి వచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది.

నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు
2. మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ
5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు.

అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండదని ప్రభుత్వం భావిస్తోంది.

# పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలి



**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, అదనపు ఖర్చు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్ మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు.. ఇప్పుడు మేము మీకు ఇవ్వం అనే కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తామని అంటున్నారు. తమకు అసెంబ్లీలో పీపీటీ చాన్స్ ఇవ్వకపోతే.. కాంగ్రెస్‌కు కౌంటర్ గా తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చేందుకు హరీష్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

## మూసీకి మహర్దశ..

-మొదటిపేజీ తరువాయి

ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**మూసీ ప్రాంతంలో ప్రతిపక్ష నేతలు ఉంటారా?: రేవంత్ రెడ్డి**

మూసీకి శాశ్వత పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రెండేళ్లలో గండిపేటకు గోదావరి నీళ్లను తీసుకొస్తామన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందని వ్యాఖ్యలు చేశారు. ప్రణాళికబద్ధంగా మూసీ ప్రక్షాళన జరుగుతుంది అంటూ క్లారిటీ ఇచ్చారు. ప్రతిపక్ష నేతలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండగలరా?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ..'మూసీ ప్రక్షాళనపై సభ్యులు సూచనలు చేశారు. సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం. మోక్షగుండం విశ్వేశ్వరయ్య వరద ముంపు పరిష్కారం చూపారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోంది. చాలా దేశాల్లో నదీ పరివాహక ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి కొనసాగుతోంది. మూసీ నది అనంతగిరిలో మొదలై 240 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఈసా, మూసా నదులు బాపూఘాట్ దగ్గర కలుస్తాయి. అందుకే అక్కడ గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ చేపట్టాం. మూసీ ప్రక్షాళనపై నెలల తరబడి అధికారులతో సమీక్షలు చేశాం. ప్రణాళికబద్ధంగా మూసీ ప్రక్షాళన జరుగుతుంది. ఈసా, మూసా నదులను గోదావరి నీళ్లతో నింపుతాం. రెండేళ్లలో గండిపేటకు గోదావరి నీళ్లను తీసుకొస్తాం. సంక్రాంతిలోగా ఫస్ట్ ఫేజ్‌పై క్లారిటీ వస్తుంది. ఫస్ట్‌ఫేజ్‌లో గండిపేట నుంచి గౌరెల్లి వరకు ప్రక్షాళన జరుగుతుంది. మొత్తం 55 కిలోమీటర్ల మేర మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి జరుగుతుంది. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తాం. మూసీని కలుషితం చేయడంతో నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. మనుషులు నివాసం ఉండటానికి సాధ్యం కాని విధంగా నల్లగొండ జిల్లా మారిపోయింది. ఫ్లోరైడ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ ప్రాంతంలో ఫ్లోరైడ్ కారణంగా బిడ్డలు అంగవైకల్యంతో పుడుతున్నారు. మూసీ నదిలో నీళ్లు పారాల్సిందేనని అధికారులకు ఆదేశిలిచ్చాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని నిర్ణయించాం. గండిపేటలో ఆగర్భశ్రీమంతులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. ఫామ్‌హౌసులు కట్టుకుని డ్రైనేజీ నీళ్లను గండిపేట చెరువులో కలిపారు. గండిపేట, మొయినాబాద్‌లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వాళ్లు లక్షలు, కోట్లు ఖర్చు చేసి నాపై సోషల్ మీడియాలో బద్నాం చేయించారు. అయినా మేం భయపడలేదు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్ట్ చేపట్టి 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో కూడా గంగా నది ప్రక్షాళన కోసం ఇళ్లు కూల్చారు. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన చేస్తామని చెప్పారు. నిజాం చేసిన అభివృద్ధిని కాలగర్భంలో కలిపేశారు. మూసీ ప్రక్షాళనకు ఎంత అవుతుందో ఇప్పుడే చెప్పలేం. మూసీ పరివాహక ప్రాంతాల్లో శివాలయం, గురుద్వార్, మసీదు, చర్చి నిర్మిస్తాం. మూసీ ప్రక్షాళన జరగలా వద్దా?.. ప్రతిపక్ష నేతలు చెప్పాలి. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదలకు నివాసాలు కల్పిస్తామంటే అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష నేతలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండగలరా?' అని ప్రశ్నించారు.

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కవిత వెంటనే స్పందించారని, కానీ హరీశ్ రావుపై చేసిన విమర్శలపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని కోమటిరెడ్డి నిలదీశారు. ఇది చూస్తుంటే కవిత కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా ఉన్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని కవిత ప్రశ్నించి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని కవిత స్వయంగా అంగీకరించడం హర్షణీయమని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని కవిత స్వయంగా ఆరోపిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

## మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

మీకు మీకు స్నేహం ఉందనే విషయం తనకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అలా మాట్లాడటం సముచితం కాదని స్పీకర్ పేర్కొన్నారు.

**తెలంగాణలో కుక్కకాట్లు పెరుగుతున్నాయి: అక్బరుద్దీన్ ఒవైసీ**

తెలంగాణ రాష్ట్రంలో కుక్కకాట్లు పెరుగుతున్నాయని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎవరినీ కించపరచడం లేదని, కానీ కుక్క కాట్లు పెరగడం ఆందోళనకరమని అన్నారు. జంతు సంరక్షణ సంస్థలు వచ్చి కుక్కలను పట్టుకోవద్దని, చంపవద్దని చెబుతుంటారని, కానీ అవే కుక్కలు చిన్న పిల్లలను కూడా కరుస్తున్నాయని ఈ విషయాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## చైనా మాంజాతో ముంచుకొస్తున్న ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

కొన్నిసార్లు అవి చెట్లకు చిక్కుకొని తెగిపోతున్నాయి. ఆ మాంజా అలాగే వేలాడుతుంటుంది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల మెడకు అది చుట్టుకొని గాయపడుతున్నారు. బైక్ వేగాన్ని బట్టి ప్రమాద తీవ్రత పెరిగి కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. పక్షులు కూడా వాటికి చిక్కుకొని చనిపోయిన ఘటనలున్నాయి.

**మొక్కుబడి చర్యలతో అధికారులు**

ఇటీవల షంషీర్‌గంజ్‌లో యువకుడు బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. మల్లికార్జున్‌నగర్‌లో మరో యువకుడి మెడకు చుట్టుకోవడంతో గాయపడి ఆసుపత్రిలో చేరాడు. మెడ కింది వరకు 19 కుట్లు వేశారు. ఏటా ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నా, అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాటి అమ్మకాలు జరుగుతున్నప్పటికీ మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు.

**తీసుకోవల్సిన జాగ్రత్తలు :**

బైక్‌పై వీధులు, సందుల్లో వెళ్లేటప్పుడు పరిసరాలను గమనిస్తూ తక్కువ వేగంతో ప్రయాణించాలి. గాలి పటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజా తొలగించాలి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ఫుల్‌హెల్మెట్ ధరించాలి. మాంజా, రోడ్డు ప్రమాదం జరిగినా కాపాడుతుంది. నిరంతరం తిరిగేవారు బైక్ హ్యాండిల్‌పై కైట్ గార్డ్‌లు అమర్చుకోవాలి. గాలిపటాలను ఎగరవేసేందుకు కాటన్, పర్యావరణ హిత దారాలు వాడటం మేలు. చైనా మాంజా వినియోగించొద్దు. రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనల సమీపంలో పతంగులు ఎగురవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్లపై మాంజా ఉంటే జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించాలి.

ల చైనా మాంజా తయారీ ప్రమాదకరంగా ఉంటుందని నిపుణులు తెలిపారు. దీనిని నైలాన్, సింథటిక్ ఫైబర్ దారాలతో తయారుచేస్తారు. ఇందులో గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమాన్ని పూసి ఎండలో ఆరబెడతారు. ఇలా చేయడం వల్ల తెగిపోకుండా పదునుగా ఉంటుంది. దారాన్ని గట్టిగా లాగితే చేయి తెగిపోయే పరిస్థితి.

# పల్లె పరిశుభ్రత గ్రామాలకు అందం.!

ఖీ ప్రజా క్షేమం కోసం మరో ముందడుగు వేసిన లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్లిసామాన్యుడి అస్త్రం: మణుగూరు మండలం మణుగూరు: లంకమల్లారం గ్రామపంచాయితీలో ప్రజల ఆరోగ్య దృశ్య వ్యాయామం కోసం పిల్లలకు ఆట స్థలం కోసం, పంచాయితీ సమావేశాలకు, పల్లె పరిశుభ్రత చేస్తూ.. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో చెత్తా.. చెదారంను డోజర్ ట్రాక్టర్ తో లంకమల్లారం పంచాయితీ సర్పంచ్ పూనెం రమేష్ తన సొంత ఖర్చులతో పరిశుభ్రంగా చేయించడం జరిగింది. తదనంతరం పంచాయితీ లోని నూతనంగా మొక్కల పెంపకాన్ని ఏర్పాటు చేస్తూ.. పల్లెలకు ప్రకృతే అందం అని భావించి, ప్రకృతి వనం కోసం, జనం క్షేమం కోసం, స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించేందుకు నర్సరీ ని ప్రారంభోత్సవం చేయడం జరిగింది. పంచాయితీ కార్యాలయంకు చేరువలోవున్న



రహదారి అధ్వనంగా ఉండి రాకపోకలకు అధికారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్భాన్ని గమనించిన సర్పంచ్ పూనెం రమేష్ వెంటనే స్పందించి గ్రావెల్ రోడ్డు పోయించడంమైనది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వెంటవెంటనే పనులు చేయడంపట్ల ప్రజలు ఎంతగానో ప్రోత్సాహిస్తూ.. ముందు ముందు



రోజుల్లో కూడా ఇలానే మరెన్నో సమస్యలు పరిష్కారం చేస్తూ తిరుగులేని నాయకుడిగా.. ప్రజా సేవకుడిగా నిలవాలని ఆకాంక్షిస్తూ.. ఆశీర్వదించడం జరిగింది. పలు కార్యక్రమాల్లో ప్రజల మనసులో తనదైన ముద్ర వేసుకుంటూ.. సుస్థిర స్థానం సంపాదించుకుంటున్న సర్పంచ్ పూనెం రమేష్.

## నూతన గ్రామ సర్పంచ్ కి అంగన్వాడి చిన్నారుల తో సన్మానం



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ మండలంలోని గానుగపహాడ్ గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన శానబోయిన అనూష మహిపాల్ అంగన్వాడి పరిశీలనలో భాగంగా అంగన్వాడి సెంటర్ కి వచ్చిన సందర్భంగా అంగన్వాడీ టీచర్ దడిగే పద్మ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి సర్పంచి అనూష మహిపాల్ ని సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ పద్మ మాట్లాడుతూ అంగన్వాడి సంక్షేమ అభివృద్ధి కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సర్పంచ్ అనూష మాట్లాడుతూ నేటి బాలు రేపటి పౌరులని చిన్నతనం నుంచి పిల్లలకి సమాజా జ్ఞానాన్ని నేర్పించాలని అన్నారు అప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయని దేశం అభివృద్ధి చెందుతుందన్నారు ఈ కార్యక్రమంలో శానబోయిన మైపాల్, కడింగుల ప్రసన్న, గర్భిణీ స్త్రీ బాలింతలు బడి పిల్లలు పాల్గొన్నారు

## కొంతిలి గ్రామానికి వెలుగుల పండుగడ

వీధి దీపాలతో రాత్రివేళ భద్రతకు భరోసా

దగ్గరుండి పనులు పూర్తి చేయించిన సర్పంచ్ రేగం రమేష్



**సామాన్యుడి అస్త్రం హుకుంపేట :** హుకుంపేట మండలం కొంతిలి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత మార్గాల్లో వీధి దీపాల ఏర్పాటు పనులను స్థానిక సర్పంచ్ రేగం రమేష్ స్వయంగా పర్యవేక్షిస్తూ పూర్తి చేయించారు. గ్రామ ప్రజలు కొన్ని రోజులు గా ఎదురుచూస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ, రాత్రివేళల్లో భద్రత, రాకపోకలకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాత్రివేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. వీధి దీపాల ఏర్పాటుతో గ్రామం మొత్తం వెలుగులతో కళకళలాడుతూ, ప్రజల్లో భద్రతాభావం మరింత పెరిగిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా దగ్గరుండి పనులు చేయించడమే తన ధ్యేయమని సర్పంచ్ రేగం రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, కొంతిలి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ రేగం రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ భరోసా ఇచ్చారు.

## ప్రొ వెంకటరాజయ్య యాదిసభ జనగామ తపన పుస్తక పరిచయసభ పోస్టర్ ఆవిష్కరణ

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్వర్యంలో ఈనెల 4న జనగామ జిల్లా కేంద్రంలో జరుగనున్న దివంగత రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాటికొండ వెంకట రాజయ్య యాది సభ జనగాం తపన కవితా సంకలనం పరిచయ సభ పోస్టర్ ను జనగామలో సోమవారం ఆవిష్కరించారు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గౌతమ్ మోడల్ స్కూల్ లో ఈ కార్యక్రమానికి జి.కృష్ణ,అయిలా సొమనర్సింహచారి అధ్యక్షత వహిస్తారు.ముఖ్య అతిథిగా కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి,విశిష్ట అతిధి గా నెల్లుట్ల రవీందర్ రావు, ఆత్మీయ అతిధులు పెసరు లింగారెడ్డి, మోతె సురేందర్ రెడ్డి పాల్గొంటారు. పుస్తకాన్ని తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ ప్రభాకర్, పెట్లోజు సోమేశ్వరాచారి, పొట్టబత్తిని భాస్కర్, కోక్కొండ జగదీశ్వరి, కొట్టె శ్రీలత, చిలుమోజు సాయికిరణ్, మంతెన వీరనర్సయ్య, కొలిపాక బాలయ్య, పానుగంటి రామమూర్తి, సాంబరాజు యాదగిరి, జోగు అంజయ్య, రెడ్డి రత్నాకర్ రెడ్డి, కడకంచి పాపయ్య, రేణుకుంట్ల మురళి, నక్క సురేష్ పాల్గొంటారు. కార్యక్రమ



నిర్వహణ, సమన్వయ కర్తగా డాక్టర్ వేముల సదానందం వ్యవహరిస్తారు. రంగరాజు ప్రసాద్ స్వాగతం, వందన సమర్పణ గడ్డం మనోజ్ కుమార్ చేస్తారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, నెల్లుట్ల రవీందర్ రావు, సెవెల్లి సంపత్, మంగళంపల్లి రాజు, జి.కృష్ణ,లగిశెట్టి ప్రభాకర్, పెట్లోజు సోమేశ్వరా చారి, అయిలా సొమనర్సింహచారి,డాక్టర్ వేముల సదానందం, పొట్టబత్తిని భాస్కర్, రంగరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

## దురుసు మాటలతో ప్రజలను తిప్పికొడుతున్న సచివాలయ సిబ్బంది!

ములియపుట్టు పంచాయతీ సచివాలయంపై మండిపడ్డ టీడీపీ నాయకులు

ప్రజా సేవా కేంద్రం కాస్తా 'అవమానాల అడ్డాగా' మారిందన్న ఆరోపణలు

టీడీపీ నాయకుడు కిముదు సుధాకర్





**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** హుకుంపేట మండలం ములియపుట్టు గ్రామ పంచాయతీ సచివాలయం ప్రజా సేవా కేంద్రంగా కాకుండా, ప్రజలను అవమానించే కేంద్రంగా మారిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు గ్రామంలో మారుమోగుతున్నాయి. డిజిటల్ అసిస్టెంట్ ఇంజనీర్ దురుసు ప్రవర్తన, సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా కార్యాలయ నిర్వహణ, ప్రజలకు సరైన అవగాహన ఇవ్వకుండా తిప్పికొట్టడం వంటి ఘటనలు గ్రామస్థుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి. నూతన పెన్షన్లు, గృహనిర్మాణ పథకాలు, ఆధార్ చేర్పులుమార్పులు, వివిధ ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు రోజులు తరబడి సచివాలయ చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాల్సిన బదులు, సచివాలయ గడప వద్దే అడ్డంకులుగా మారుతున్నాయన్న వాపులు వినిపిస్తున్నాయి. "ప్రజా సేవ అంటే ఇదేనా?" టీడీపీ నాయకుడు కొంతిలి ఆగ్రహం ఈ వ్యవహారంపై స్థానిక టీడీపీ నాయకుడు కిముదు సుధాకర్,తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ౧ "పంచాయతీ ములియపుట్టులో దుర్వ్యవహారాల కేంద్రమైపోయింది. డిజిటల్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రజలను పట్టించుకోకుండా దురుసు మాటలతో తిప్పికొడుతున్నారు. సిబ్బంది తమకు నచ్చిన సమయాల్లో మాత్రమే కార్యాలయం తెరిచి, మిగతా వేళల్లో ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారు." అదే విధంగా, ౧ "పెన్షన్లు, హౌసింగ్ పథకాలు, ఆధార్ మార్పులు, ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు నెలల తరబడి తిరుగుతున్నారు. చెప్పులు అరిగిపోతున్నాయి, ఆశలు అరిగిపోతున్నాయి. ఇది పూర్తిగా అశాసన స్థితి. మండలాధికారులు, ఎంపీడీఓలు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి"అని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్థుల ఆవేదన: "చెప్పులు అరిగాయిఢ ఫలితం శూన్యం!" సచివాలయ వైఖరిపై గ్రామస్థుల వేదన కన్నీళ్ల రూపంలో బయటపడుతోంది. వృద్ధుడు వెంకటరాము వాపోతూ, ౧ "పెన్షన్ కోసం నాలుగు నెలలుగా తిరుగుతున్నాను. ప్రతి సారి ఏదో కారణం చెబుతారు. దురుసు మాటలే తప్ప పని లేదు" అన్నారు. ఇక రైతు భీమరాజు మాట్లాడుతూ, ౧ "ఆధార్ మార్పుల కోసం ఎన్నిసార్లు రావాలో లెక్కలేదు. గృహనిర్మాణ పథకం కోసం చెప్పులు అరిగిపోయాయి. మేము పేదలండ మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు" అని వేదన వ్యక్తం చేశారు. సేవా మానసికత ఎక్కడ? పరిపాలన జోక్యం తప్పనిసరి ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కానీ ములియపుట్టులో జరుగుతున్న ఘటనలు ఆ వ్యవస్థపైనే ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమిస్తామని టీడీపీ నాయకులు కొంతిలి, కిముదు సుధాకర్ హెచ్చరించారు. జిల్లా పరిపాలన అధికారులు తక్షణమే స్పందించి, సచివాలయాల్లో సేవా భావనను పునరుద్ధరించాలి. లేకపోతే గ్రామీణ ప్రజల ఆవేదన మరింత ఉధృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## హరిద్వార్‌లో ఉచిత గురుకుల్ విద్యా అవకాశం

వసతి, భోజనం పూర్తిగా ఉచితం నెలకు రూ.8,000 స్కాలర్‌షిప్

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** మార్చి 15 నుంచి జూలై 15 వరకు ఇంటర్వ్యూలు హరిద్వార్ హిందూ సంప్రదాయ విద్యకు కేంద్రంగా నిలుస్తున్న హరిద్వార్‌లోని ఆచార్య పాణిగ్రహి చతుర్వేద సంస్కృత వేదపాఠశాలలో హిందూ బాలల కోసం ఉచిత గురుకుల్ విద్యా అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. 6వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా, మార్చి 15 నుంచి జూలై 15 వరకు నిర్వాహకులు తెలిపారు. గురుకుల్‌లో విద్యనభ్యసించే విద్యార్థులకు వసతి, భోజనం, విద్యా సామగ్రి సహా అన్ని సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా కల్పించనున్నారు. అదనంగా విద్యార్థుల ప్రోత్సాహార్థం



నెలకు రూ.8,000 స్కాలర్‌షిప్ కూడా అందించనున్నారు. ఈ గురుకుల్‌లో విద్యార్థులకు నాలుగు వేదాలు, వ్యాకరణం, సంస్కృత సాహిత్యం, ఇంగ్లీష్‌తో పాటు ఆధునిక విద్యా విషయాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నారు. వేదాల్లో నిపుణులుగా తీర్చిదిద్దడమే కాకుండా, ఎం.ఏ వరకు ఉన్నత విద్య పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. హిందూ సమాజానికి ఉన్న గొప్ప గురుకుల్ విద్యా సంప్రదాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆసక్తి గల హిందూ తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంప్రదించాల్సిన వివరాలు

## జనగామ పట్టణంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని

జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషాకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణంలో పేరుకపోయిన సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిపిఎం జనగామ పట్టణ కమిటీ బృందం జనగామ జిల్లా కార్యాలయంలో జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాష కి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు అనంతరం సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ జనగామ పట్టణంలో వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు మరియు జనగామలో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని రంగప్ప చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలని బాణాపురం ఇందిరమ్మ కాలనీ వీవర్స్ కాలనీ గిర్నిగడ్డ అంబేద్కర్ నగర్ శివార్ ప్రాంతాలలో సీసీ రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అన్నారు జనగామ పట్టణంలో చితకోడూర్ నుండి వాటర్ ఫిల్టర్ బెడ్డును శుభ్రం చేసి మంచినీరు అందించాలని అన్నారు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం కోసం నెహ్రూ పార్క్ దగ్గర సిగ్నల్ పాయింట్ గెస్ట్ హౌస్ దగ్గర సిగ్నల్ పాయింట్ కలెక్టర్ ఆఫీస్ దగ్గర సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని అన్నారు . ఇందిరమ్మ ఇండ్లు ఇండ్లు లేని పేదలకు డబల్ బెడ్రూంలు ఇవ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి ఎండి అజారుద్దీన్ పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం నాయకులు ధరావత్ మహేందర్ పాల్గొన్నారు

## రీసర్వేతో రైతుకు న్యాయండ పసుపుస్తకాలతో భూమికి భరోసా

ములియపుట్టులో భూ హక్కుల పండుగ

తహశిల్దార్ వి. శ్రీనివాసరావు చేతుల మీదుగా పసుపుస్తకాల పంపిణీ



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ముల్యపుట్టు పంచాయతీ రైతుల కు పండగ వాతావరణాన్ని సృష్టించిందని చెప్పుకోవచ్చు ఏళ్ల తరబడి భూ సరిహద్దులు, రికార్డుల గందరగోళంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఊరట కలిగిస్తూ హుకుంపేట మండలం ములియపుట్టు గ్రామపంచాయతీలో రీసర్వే పూర్తైన భూములకు సంబంధించి భూ పట్టాదారు పసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఆదర్శంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహశిల్దార్ వి. శ్రీనివాసరావు మరియు హుకుంపేట మండల టీడీపీ కార్యదర్శి బొడ్డ శ్యామ్,ముఖ్య అతిథిలుగా పాల్గొని, లబ్ధిదారుల చేతుల్లో భూ హక్కుల పత్రాలను అందజేశారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులు ఖచ్చితంగా నిర్ధారించడంతో రైతుల హక్కులకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని ఆయన తెలిపారు. భూ వివాదాలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. భూమిపై హక్కుకు చట్టబద్ధ ముద్ర పసుపుస్తకాల పంపిణీతో రైతులు తమ భూములపై పూర్తి యాజమాన్య హక్కులు పొందారని, భవిష్యత్తులో రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా అందేలా ఇది దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రైతుల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసిందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ భూ హక్కుల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, హుకుంపేట మండల టీడీపీ కార్యదర్శి బొడ్డ శ్యామ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొని రైతులకు అభినందనలు తెలిపారు. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన అధికారులను వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెవెన్యూ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించిన ములియపుట్టు వీఆర్వో బండంగి బాలకృష్ణను హుకుంపేట మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. దుసాల్వతో సత్కరించి, ఆయన సేవలను ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కొనియాడారు. ప్రజాప్రతినిధుల హాజరుతో ప్రత్యేక ఆకర్షణ హుకుంపేట మండల టీడీపీ కార్యదర్శి బొడ్డ శ్యామ్ మాట్లాడుతూ... రైతుల్లో ఆనందండ గ్రామంలో విశ్వాస వాతావరణం రీసర్వేతో భూములపై స్పష్టత రావడం వల్ల ఇకపై వివాదాలకు తావు లేకుండా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంకల్పం గ్రామస్థాయిలో ఫలిస్తున్నదనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం మరింత బలపరిచిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతమ్మ, ములియపుట్టు సర్పంచ్, వీఆర్వో బాలకృష్ణ, విలేజ్ సర్వర్ రమేష్ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ములుగు ఎస్ ఐ ని కలిసిన బైలంపూర్ సర్పంచ్

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్



**సామాన్యుడి అస్త్రం గజ్వేల్:** నియోజకవర్గం ములుగు మండలంలోని బైలంపూర్ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మచ్చల కృష్ణ శుక్రవారం ములుగు పోలీస్టేషన్ లో ములుగు ఎస్సై రఘుపతిని కలిసి శాలువా కప్పి, మొక్క ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో స్వామి రాజు కృష్ణ పరశు రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హుకుంపేటజీకే మండ పంచాయితీల సమస్యలు ఎంపీ దృష్టికి

త్రాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లకు మొర

ఐదేళ్లుగా సురక్షిత త్రాగునీరు లేక ఇక్కట్లు అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

**సామాన్యుడి అస్త్రం హుకుంపేట :** హుకుంపేట మండలంలోని గడికించుమండ మరియు హుకుంపేట పంచాయితీల్లో నెలకొన్న దీర్ఘకాలిక ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు అరకు పార్లమెంట్ సభ్యులు డా. గుమ్మా తనుజారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కే. కృష్ణరావు, కొండమ్మలతో పాటు ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణరావు పాల్గొని సమస్యలతో కూడిన మెమోరాండం సమర్పించారు. త్రాగునీరు లేక గడికించుమండ ప్రజల అవస్థలు తరువాత మీడియాతో మాట్లాడిన నాయకులు, గడికించుమండ పంచాయితీ పరిధిలోని దొంతురాయి గ్రామంలో సక్రమమైన త్రాగునీటి సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని, వర్షాకాలంలో వర్షపు నీరు నేరుగా ఇండ్లలోకి చేరి జీవనం నరకప్రాయంగా మారుతోందన్నారు. మండల కేంద్రంలోనే నీటి కటకట అదేవిధంగా మండల కేంద్రం హుకుంపేట పంచాయితీ పరిధిలోని మొదమాంబ కాలనీ, సీపీఎం కాలనీ, నిలగడ్డ వీధి ప్రాంతాల ప్రజలు గత ఐదేళ్లుగా సురక్షిత త్రాగునీటికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ సమస్యపై ఏ మాత్రం దృష్టి సారించలేదని, అధికారుల నిర్లక్ష్యమే ప్రజల కష్టాలకు కారణమని ఆరోపించారు. ఫిర్యాదులపై స్పందించని అధికారులు త్రాగునీటి సమస్యపై మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓలకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. 07-11-2025న ఐటిడిఏలో నిర్వహించిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు హడావుడిగా బోర్లు తవ్వి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. 'పరిష్కారాలంటూ ప్రకటనలేడ భూమిపై అమలు శూన్యం' పీజీఆర్ఎస్‌లో సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్, జేసీలు, పీఓలు మీడియా ప్రకటనలు చేస్తున్నా భూమిపై మాత్రం ఎక్కడా ఫలితాలు కనిపించడంలేదని మండిపడ్డారు. రోడ్డు లేక రోగులకే కాదుడ విద్యార్థినులకూ అవస్థలు నిత్యం వ్యాధిగ్రస్తులు ప్రధాన రహదారి నుంచి పీహెచ్‌సీకి నడక మార్గంలోనే ప్రయాణం చేయాల్సి వస్తోందని తెలిపారు. అదే మార్గంలో జూనియర్ కళాశాల విద్యార్థినులు రోజూ రాకపోకలు సాగిస్తున్నారని, సీసీ రోడ్డు వేయాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ పనులు అర్థంతరంగా నిలిపివేత మండల కేంద్రంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు, అడ్డుమండ రహదారికి అనుకొని ఉన్న డ్రైనేజీని పీకేసి కొత్తది నిర్మించకుండా పనులు నిలిపివేశారని ఆరోపించారు. ఈ విషయంలో పంచాయితీ అధికారులు గానీ, మండల అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా ఆందోళనలకు అధికారుల నిర్లక్ష్యమే కారణం అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్లనే ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సురక్షిత త్రాగునీరు, మెరుగైన డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు టి. రాంబాబు, సీహెచ్. సింహాచలం, పి. దొర, లింగమూర్తి, సూరిబాబు, ఈశ్వరరావు, లీలావతి, జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.



## గిరిపుత్రులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజా

ఎన్ఐటీలో సీటు సాధించిన గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ

గిరిజన ప్రాంతాలకు గర్వకారణంగా నిలిచిన శెట్టి అఖిల్ విజయం




**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, విద్యే ఆయుధంగా ప్రపంచస్థాయిలో రాణించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజా పిలుపునిచ్చారు. 2025లో నిర్వహించిన ఎన్ఐటీ (ఎన్ ఐ టి.) ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో సీటు సాధించిన గిరిజన విద్యార్థిని, ఐటీడీఏ పాడేరు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన ప్రతిభకు జాతీయ గుర్తింపు అనంతగిరి మండలం, కొత్తూరు పంచాయతీ శివలింగపురం గ్రామానికి చెందిన శెట్టి వెంకట్రావు కుమారుడు శెట్టి అఖిల్, మన్యం జిల్లా (పార్వతీపురం) జోగంపేటలో ఇంటర్ ఎంపీసీ చదివి 911 మార్కులు సాధించారు. అనంతరం 2025 జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబర్చి 96 శాతం మార్కులతో ఎన్ఐటీ ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ ప్రతిభ ఫలితంగా, దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అయిన లిఅస్సాం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ సిల్చర్,)లిలో అత్యంత డిమాండ్ ఉన్న బీ.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సి ఎస్ సి.) విభాగంలో సీటు దక్కించుకోవడం గిరిజన ప్రాంతాలకు గర్వకారణంగా నిలిచింది. ఉన్నత చదువులకు ఐటీడీఏ భరోసా శుక్రవారం ఉదయం పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఉన్నత విద్యలో సాంకేతిక అడ్డంకులు లేకుండా చూడాలనే ఉద్దేశంతో ఐటీడీఏ తరపున విద్యార్థికి ఉచిత ల్యాప్‌టాప్‌ను ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజా అందజేశారు. 'గిరిజన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉంది' ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ౧ "గిరిజన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంది. సరైన మార్గదర్శనం, ప్రోత్సాహం లభిస్తే వారు జాతీయఅంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు. అస్సాం ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించడం గిరిజన ప్రాంతాలకే గర్వకారణం" అని కొనియాడారు. ప్రభుత్వం, ఐటీడీఏ సంస్థలు ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. అధికారుల అభినందనలు ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (పి వి టి జి,) వెంకటేశ్వరరావు, పరిపాలన అధికారి హేమలత పాల్గొని విద్యార్థిని అభినందించారు. శెట్టి అఖిల్ సాధించిన విజయం గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని వారు తెలిపారు.

## డ్రోన్ సహకారంతో వ్యవసాయ పనులు



**సామాన్యుడి అస్త్రం సీతానగరం :** సీత నగరం మండలం లో డ్రోన్ సహకారంతో వ్యవసాయ పనులు చేసుకోవడం జరుగుతుందిని చిపుర పల్లి రైతులు తెలియజేసారు. అతి తక్కువ ఖర్చుతో పొలాలకి డ్రోన్ సహకారంతో పిండి వేయడం జరుగుతుందన్నారు.ద

## లక్కాజిపల్లి గ్రామంలో మద్యం అమ్మకాలపై సంపూర్ణ నిషేధం

గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం ఉల్లంఘిస్తే రూ.10 వేల జరిమానా



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** లక్కాజిపల్లి గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాల కారణంగా ఏర్పడుతున్న సామాజిక సమస్యలను అరికట్టేందుకు గ్రామపంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ సర్పంచ్ శ్రీమతి ముష్కి రేణుక అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామపంచాయతీ సమావేశంలో గ్రామ పరిధిలో మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహించడంతో కుటుంబ కలహాలు, యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని గ్రామ సమైక్య సంఘాలు, కుల సంఘాలు, గ్రామ ప్రజలు పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న గ్రామపంచాయతీ విస్తృతంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 10 జనవరి నుంచి అమల్లోకి గ్రామంలో 10-01-2026 నుంచి మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం అతిక్రమించి మద్యం అమ్మకాలు నిర్వహించిన వారికి రూ.10,000 జరిమానా విధించనున్నట్లు తీర్మానంలో పేర్కొన్నారు. కిరాణా దుకాణాల్లో గానీ, ఇళ్ల ఆవరణలో గానీ మద్యం అమ్మకం, కొనుగోలు లేదా మద్యం సేవించడం దొరికినట్లయితే సంబంధిత షాపు యజమానికి రూ.10 వేల జరిమానా విధిస్తామని గ్రామపంచాయతీ హెచ్చరించింది. సమాచారం ఇచ్చిన వారికి బహుమతి అక్రమ మద్యం విక్రయాలను గుర్తించి సమాచారం అందించిన వారికి రూ.2,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. గ్రామంలో శాంతి భద్రతలు, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ ముష్కి రేణుక తెలిపారు. ఈ తీర్మానాలు గ్రామ పాలకవర్గం మరియు గ్రామపంచాయతీ అనుమతితో అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు

## వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి




సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి

పిజిఆర్ఎస్ కు 79 అర్జీలు

జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఎ ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీ పూజ

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 79 వినతులు వచ్చాయి. జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీ పూజ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్,పాడేరు ఇంచార్జ్ ఆర్ డివో ఎమ్ వివిఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు పరిష్కారం నిమిత్తం అందించి త్వరితగతన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఏ పివో విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యల్లో అత్యధికం రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, డిఆర్డిఏ శాఖలకు సంబంధించినవేనని వాటిని పరిష్కరించుటలో అధికారులు అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి అంతర్గత రహదారులు మండల కేంద్రం నుండి గ్రామానికి, గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగనవాడి కేంద్రాలకు అనుసంధానం అయ్యాయో లేదో ప్రస్తుతం అవి ఏ పరిస్థితుల్లో, ఏ స్థితిగతులలో ఉన్నాయో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తో నివేదికలు తయారు చేయాలని, సర్వే చేయించాలని జిల్లా సర్వే, రెవెన్యూ, ఐటీడీఏ ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పిర్యాధుదారునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలని, ఫిర్యాదును ముగించుటలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ జీనబాడు గ్రామానికి చెందిన గాలి పార్వతమ్మ ఒక్కగానొక్క కుమారుడు గాలి అప్పలరాజు 23 సంవత్సరాలు రైవాడ జలాశయంలో ప్రమాదవశాత్తు మరణించుటవలన ఉపాధి , భృతి కుటుంబం ఉపాధి కోల్పోయిందని, ప్రభుత్వం వారు ఉపాధి కల్పించాలని విన్నవించారు. హుకుంపేట మండలం బి బొడ్డు పుట్టు పంచాయితీ బి బొడ్డు పొట్టు గ్రామానికి చెందిన కొండిభ. సింహాచలం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించాలని దరఖాస్తు సమర్పించారు. పెదబయలు మండలం పెద్ద కోడపల్లి పంచాయతీ తాడిపుట్టు గ్రామానికి చెందిన కె. బసవన్న, పి ప్రసాద్ గ్రామంలో సోలార్ సిస్టం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలనీ, పశువుల నుండి కాఫీ తోటలను రక్షించాలని కోరారు. పెదబయలు మండలం జామిగూడ పంచాయతీ తారాబు గ్రామానికి చెందిన సూరి రాముడు, ఎంబారి బాబురావు ఇంతిగి సత్యారావు, మొండిపల్లి మంగళరావు తారాబు జలపాత ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని, ఇంజరి నుండి తారాబు వరకు నాలుగు కిలోమీటర్లు బి టి రోడ్డు నిర్మించాలని అర్జీ సమర్పించారు. పెదబయలు మండలం సీగరి పంచాయతీ బయలు వీధి గ్రామానికి చెందిన సిద్ది ఈశ్వరరావు, మత్స్య రాజు బయలు వీధి నుండి సీగరి వరకు సి సి రోడ్డు నిర్మించాలని కోరారు. హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ ఎగరోడి గ్రామానికి చెందిన పాంగి వెంకటరావు సిమిలిగూడ నుండి పెట్టగూడ వరకు సిసి రోడ్ నిర్మాణం చేపట్టాలని వినతి సమర్పించారు. పాడేరు హుకుంపేట పెదబయలు మండలాల్లో ఆర్ వో ఎఫ్ ఆర్ పట్టాలు, పెన్షన్లు మంజూరు చేయాలని ఆదివాసీ మహాసభ సంస్థకు చెందిన సభ్యురాలు కె. ధనలక్ష్మి దరఖాస్తు సమర్పించారు కొయ్యూరు మండలం చింతలపూడి పంచాయతీ గింజరి గ్రామానికి చెందిన దేవర అప్పారావు, ఎం సత్యనారాయణ గ్రామంలో ఐదో తరగతి వరకు పాఠశాల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు పి.బి.కె పరిమళ, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి . కృష్ణ మూర్తి నాయక్ , జిల్లా మత్స్య శాఖ అధికారి సూర్య రావు, జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ అధికారి జగన్మోహన్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, రహదారులు భవనాల శాఖ ఈఈ బాల సుందర బాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, డిపివో కె.పి. చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ .జయప్రకాష్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి. ప్రసాద్, పలువురు తాహాసిల్దార్లు తదితరులు ఉన్నారు.

## డ్రైవర్స్ కాలనీలో ఘనంగా గజ్జల పూజ కార్యక్రమం..

ముఖ్య అతిధిగా హాజరైన కంబాల..

గజ్జల పూజకు కంబాల 1,50,000 రూపాయలు విరాళం...



**సామాన్యుడి అస్త్రం తూర్పుగోదావరి :** గోకవరం గ్రామం డ్రైవర్స్ కాలనీలో దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి కోలాట గజ్జల పూజ కార్యక్రమం, అంగరంగ వైభవంగా జరిగింది. బి లి ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు...లి తొలిత ఆయనకు మహిళలు, కాలనీవాసులు, బాణసంచా కాలుపులతో, పూలు జల్లుతూ, ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. లి అనంతరం కంబాల శ్రీనివాసరావు వెంకటేశ్వర స్వామి వారి దర్శించుకుని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ గజ్జల పూజ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు 1,50,000 రూపాయలు విరాళం అందజేశారు. లి కార్యక్రమం అనంతరం మహిళకు కోలాటం నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఎంతో శ్రద్ధతో కోలాటం నేర్చుకున్న మహిళలను అభినందించి, స్వామి వారి చిత్రపటాలను బహుకరించారు. లి ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, మహిళలు, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నాణ్యత కరువు

రోడ్ వేసిన 20 రోజులకే పగులు ఇస్తున్న దుస్థితి

విజిలెన్స్ అధికారులు ఎంక్వయిరీ చేస్తే క్వాలిటీ వెలుగు లోకి




**సామాన్యుడు అస్త్రం రంపచోడవరం :** మండలంలో పోక్స్ పేట నుండు ఉట్ల ఎళ్లె రహదారి గత 20 రోజుల క్రితం 77 లక్షల 50.000 రూపాయలు నాబార్డ్ నిధులతో వేయడం జరిగింది. ఐటిడిఏ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో రోడ్ నాణ్యత తో వెయ్యాలని ప్రభుత్వం ఆదేశాల జారీచేసిన పోక్స్ పేట రోడ్లో మాత్రం నాణ్యత కరువు అయ్యింది అని తెలుస్తుంది.రోడ్ వేసిన నెల రోజులు కాకుండా ముక్కలు గా పెచ్చులు ఉండిపోయింది.. సంభంచిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా రోడ్ నాణ్యత లేదుని పలువురు బహిరంగనే అంటున్నారు. ఉన్నతఅధికారులు స్పందించి విజిలెన్స్ ఎంక్వయిరీ చేస్తే క్వాలిటీ వెలుగులోకి వస్తాయి.. సంబంధించిన శాఖ అధికారులు స్పందించకపోతే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయడం జరుగుతుందని పలువురు బహిరంగనే తెలియజేశారు

# ప్రయాణ సమయంలో సీట్‌బెల్ట్ తప్పనిసరి

ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడే ప్రధాన రక్షణ సాధనం

హుజురాబాద్ వీఎ కంచి వేణు

**అస్త్రం హుజురాబాద్** : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా హుజురాబాద్‌పరకాల రోడ్డు క్రాస్ వద్ద సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని హుజురాబాద్ మోటారు వాహనాల తనిఖీ అధికారి (వీఎ×) కంచి వేణు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు, ప్రయాణికులకు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కంచి వేణు, వాహన ప్రయాణంలో సీట్‌బెల్ట్ ధరించడం చట్టపరంగా మాత్రమే కాకుండా ప్రాణరక్షణకు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. డ్రైవర్‌తో పాటు ముందు, వెనుక సీట్లలో కూర్చున్న ప్రతి ప్రయాణికుడు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. చిన్న దూర ప్రయాణమైనా నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ప్రమాదం సంభవించినప్పుడు సీట్‌బెల్ట్ వాహనం నుంచి బయటకు విసిరివేయబడకుండా అడ్డుకుంటుందని, వాహనం లోపలి భాగాలను ఢీకొనకుండా రక్షిస్తుందని అన్నారు. గణాంకాల ప్రకారం సీట్‌బెల్ట్ ధరించినవారు సీట్‌బెల్ట్ లేనివారితో పోలిస్తే 45 నుంచి 60 శాతం వరకు ఎక్కువ భద్రతలో ఉంటారని పేర్కొన్నారు. భారత మోటారు వాహన చట్టాల ప్రకారం సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి కాగా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు. వెనుక సీటులో కూర్చున్న వారు సీట్‌బెల్ట్ ధరించకపోతే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కొత్త నిబంధనలు కూడా అమల్లోకి వచ్చాయని చెప్పారు. క్యాబ్స్, టాక్సీలు వంటి అద్దె వాహనాల్లో ప్రయాణించే వారికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని, ప్రతి ప్రయాణంలో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాల్సిందేనని సూచించారు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే సీట్‌బెల్ట్ అలవాటు చేయాలని, అవసరమైన చోట బూస్టర్ సీట్లు ఉపయోగించాలని సూచించారు. సీట్‌బెల్ట్ అలారాలు, భద్రతా నిబంధనలు ప్రజల భద్రత



కోసమేనని, వాటిని విస్మరించకుండా పాటిస్తే ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని కంచి వేణు తెలిపారు. సీట్‌బెల్ట్ చిన్నదిగా కనిపించినా, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే అత్యంత కీలక భద్రతా సాధనమని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ బుర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు

# కోరపల్లిలో మానవత్వం చాటిన ఎస్.ఎస్.సి2004 బ్యాచ్ మిత్రులు

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** : జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన మామిడోజు శ్రావణ్ అమ్మగారైన కీర్తిశేషులు మామిడోజు పూలమ్మ గత నెల 23-12-2025 న స్వర్గస్తులయ్యారు. ఈ విషాద వార్త తెలుసుకున్న శ్రావణ్ తో కలిసి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎస్.ఎస్.సి2004 బ్యాచ్ మిత్రులు అందరూ ఒక్కటై ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రావణ్ నివాసానికి చేరుకున్న మిత్రులు, "ఈ కష్ట సమయంలో మేమంతా మీతోనే ఉన్నాం" అంటూ భరోసా కల్పించారు. అనంతరం మిత్రులంతా కలిసి రూ. 25,500 నగదుతో పాటు ఒక క్వింటాల్ బియ్యాన్ని కుటుంబానికి అందజేశారు. ఈ సహాయ కార్యక్రమం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. కీర్తిశేషులు మామిడోజు పూలమ్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మిత్రులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అలాగే శ్రావణ్ ని, ఆయన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఎస్.సి2004 బ్యాచ్ మిత్రుల్లో డొమకొండ నరేందర్ (50 కిలోల బియ్యం), వజ్జపల్లి కిరణ్, అరెల్లి విజేందర్, పి. రమేష్ (ఎల్ఎల్‌బి), రాగుల మహేందర్ తదితరులు ఉన్నారు. ఈ



సందర్భంగా గ్రామస్తులు మిత్రుల సేవాభావాన్ని అభినందించారు

# హుజురాబాద్ సిఐ కరుణాకర్‌కు ఘన సన్మానం

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** :ఉత్తమ సేవా పథకం అందుకున్న సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో అభినందనలు హుజురాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పథకం రావడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచిన సిఐ కరుణాకర్ సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేయడం గర్వకారణమని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. హుజురాబాద్ పట్టణంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు, మహిళలుపిల్లల రక్షణ, సైబర్ నేరాల నివారణ వంటి కీలక అంశాలపై సిఐ కరుణాకర్ ప్రత్యేక దృష్టి సారిస్తూ సమర్థవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ శాఖ నిరంతర కృషితో పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నదని, ప్రజలకు పోలీసులపై విశ్వాసం మరింత పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిఐ కరుణాకర్‌కు ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, బీసీ జేఏసీ కన్వీనర్ సందెల వెంకన్న పాల్గొని మాట్లాడుతూ ప్రజా శాంతి పరిరక్షణలో సిఐ కరుణాకర్ చూపిన నిబద్ధత ఇతర అధికారులకు ఆదర్శమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నడిగోటి రమేష్,



ఉపాధ్యక్షులు కోలిపాక క్రాంతి కుమార్, హుజురాబాద్ 26వ వార్డు కాంగ్రెస్ నాయకులు మంద బిక్షపతి (కె.ఆర్), ఎర్ర బజ్జ నారాయణ, పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, రాజు, కందుకూరి భాస్కర్, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొని సిఐ కరుణాకర్‌కు అభినందనలు తెలియజేశారు

# రైతుల కరెంటు కష్టాలకు పరిష్కారం కోరిన గ్రామస్తులు

సానుకూలంగా స్పందించిన ఏఈ పి. సుష్మ

**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట** : చిన్న కోమటిపల్లి గ్రామంలో రైతులు గత ఆరు నెలలుగా ఎదుర్కొంటున్న కరెంటు వైర్ల సమస్యపై గ్రామ సర్పంచ్ మూడేడ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రజా నాయకులు, గ్రామ రైతులు మండల విద్యుత్ శాఖ ఏఈ పి. సుష్మ మేడం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద కరెంటు వైర్లు లూజ్‌గా ఉండటంతో రైతులు ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకుని పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా భావిల కాడికి వెళ్లే సమయంలో ప్రమాదం పొంచి ఉండటంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. లూజ్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో భూమిని సాగు చేయలేక పంటలపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరగా, ఏఈ పి. సుష్మ మేడం సానుకూలంగా స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె తక్షణమే చర్యలు చేపట్టి లూజ్ వైర్ల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలపై



స్పందించిన ఏఈ మేడం అలాగే విద్యుత్ శాఖ సిబ్బందికి గ్రామ రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు.

## రోడ్డు భద్రత వారోత్సవ భాగంలో ఆర్‌టీసి డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం

**హైదరాబాద్** : రోడ్డు భద్రత వారోత్స వం భాగం లో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఏ సి పి ఆదేశాల తో బర్కతపురఆర్ టీ సి డిపో లో మేనేజర్ మంజులతో కలిసి డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై ముఖ్య సూచనలు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎస్ ఐ లు శ్రీకాంత్ ఆర్ ఎస్ ఐ తో పాటు రాకేష్ లు పాల్గొని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు.ముఖ్యం గా రోడ్డు పై కనురెప్పపాటున జరిగే ప్రమాదలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులను, కుటుంబ సభ్యులను అందరి గురించి ఆలోచించాలని కాగా బస్సు నడిపించే టప్పుడు సెల్ ఫోన్లో మాట్లాడవద్దని అన్నారు.

## ఇర్కోడ్ లిఫ్ట్ పనులు పూర్తి చేయండి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట** : సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ద్వారా మూడు నియోజకవర్గాలకు సాగు నీరు అందించే ఇర్కోడ్ లిఫ్ట్ పథకం. ఇర్కోడ్ లిఫ్ట్ పూర్తి అవుతే 17వేల ఎకరాలకు సాగు నీరు వస్తుంది21 గ్రామాలకు, 10వేల మంది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది.రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి లేఖ వ్రాసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. సిద్దిపేట మరియు దుబ్బాక నియోజకవర్గాల్లోని బీడు భూములను సస్యశామలం చేయడానికి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మించడం జరిగింది.

## డిగ్రీ కాలేజీ సమీపంలోని కృష్ణ వైన్ షాప్‌ను వెంటనే తరలించాలి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు డిమాండ్




**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** : జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో ఏర్పాటు చేసిన కృష్ణ వైన్ షాప్‌ను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు కేవలం 90 మీటర్ల దూరంలో, కాకతీయ స్కూల్ గేటుకు 50 మీటర్ల దూరంలో వైన్ షాప్‌ను ఏర్పాటు చేయడం వల్ల కళాశాలకు వెళ్లే విద్యార్థులు, విద్యార్థినులు తాగుబోతుల వేధింపులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల వల్ల యువ విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే గీతామందిర్, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు వెళ్లే మహిళా భక్తులకు కూడా ఈ వైన్ షాప్ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారికి ఆనుకుని, విద్యాసంస్థలకు అత్యంత సమీపంలో వైన్ షాప్ కొనసాగడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ పట్టణ కమిటీ తరపున జమ్మికుంట ఎక్సైజ్ సీఐ కి వినతిపత్రం అందజేశామని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి కృష్ణ వైన్ షాప్‌ను వేరే ప్రాంతానికి తరలించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, దొంతుల రాజ్‌కుమార్, రాజేష్ ఠాకూర్, కైలాసకొటి గణేష్, దాసరి రవిందర్, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, కొండపర్తి ప్రవీణ్, మురికి మహేష్, ఇటుకాల స్వరూప, నిరుపమా రాణి, బచ్చు శివన్న, కొండ్లె నగేష్, దొడ్డే వేణుగోపాల్, మెరుపురి రాజు, ఉడుగుల మహేందర్, పొనగంటి రవి, తూడి రవిచందర్, ఆవాంచ వెంకటేష్, ఆకుల పోచయ్య, తిరుపతి, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు

## రూరల్ సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన చిన్న కోమటిపల్లి నూతన పాలకవర్గం




**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలం చిన్న కోమటిపల్లి గ్రామానికి చెందిన నూతన పాలకవర్గం సభ్యులు రూరల్ సీఐ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శు భాకాంక్షలు తెలియజేస్తూ స్నేహపూర్వకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడేడ్ల కుమారస్వామితో పాటు వార్డ్ మెంబర్లు గుత్తికొండ రాంబాబు, మూడేడ్ల రవీందర్, మూడేడ్ల మహేష్, మూడేడ్ల వంశి, మూడేడ్ల ప్రవీణ్, చెట్ల మహేందర్, మూడేడ్ల రాజు పాల్గొన్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ సహకారం కీలకమని ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులుపోలీసు శాఖ సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రూరల్ సీఐ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు

## జమ్మికుంట మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయాలి



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** : బీజేపీ మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పిలుపు జమ్మికుంట: రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఆశావహులు, పట్టణ పదాధికారులు, బూత్ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాట్లాడుతూ, జమ్మికుంట మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలతో నిబద్ధతగా పనిచేసే ప్రతి కార్యకర్తకు కౌన్సిలర్‌గా అవకాశం కల్పిస్తుందని స్పష్టం చేశారు. జమ్మికుంట పట్టణంలో కార్యకర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల పేరుతో లేదా టికెట్ల పేరుతో హామీలు ఇచ్చే వారిని నమ్మి కార్యకర్తలు మోసపోవద్దని హెచ్చరించారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని గందరగోళానికి గురిచేసే నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5వ తేదీ లోపు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్‌తో పాటు దొంతుల రాజ్ కుమార్, రాజేష్ ఠాకూర్, కైలాసకొటి గణేష్, దాసరి రవిందర్, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, కొండపర్తి ప్రవీణ్, మురికి మహేష్, ఇటుకాల స్వరూప, నిరుపమా రాణి, బచ్చు శివన్న, కొండ్లె నగేష్, మెరుపురి రాజు, ఉడుగుల మహేందర్, పొనగంటి రవి, తూడి రవిచందర్, ఆవాంచ వెంకటేష్, ఆకుల పోచయ్య, తిరుపతి, సిరియాల విజయ్ తదితర బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

-ప్రజల్లోకి వేగంగా విస్తరిస్తున్న రాజ్యాధికార పార్టీ

-100 రోజుల్లోనే బలమైన పునాది

-ఉమ్మడి మెదక్‌లో ప్రజల మద్దతు పెరుగుతోంది

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్:** బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల్లో వేగంగా ఆదరణ పొందుతూ బడుగు, బలహీన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలుస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ జ్యోతి పండాల్ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు పి.నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ స్థాపించి కేవలం 100 రోజులు పూర్తైనప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలోనే సుమారు 8 మంది సర్పంచులు, పలువురు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గెలుపొందడం పార్టీపై ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇది ప్రజల్లో మార్పు కోరుకుంటున్న రాజకీయ చైతన్యాన్ని స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో, ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలలో అన్ని స్థానాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీ కమిటీలను బలోపేతం చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.దబీసీలు, ఎస్సీలు, రాజకీయాల్లో నిజమైన ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే తీన్మార్ మల్లన్న లక్ష్యమని జ్యోతి పండాల్ తెలిపారు. సామాజిక వర్గాలకు రాజ్యాధికారం సాధించాలన్న ఉద్యమానికి ప్రజలు మద్దతు



ఇచ్చి అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శాదుల్ల, యువజన విభాగం అధ్యక్షులు జలగ అశోక్, ఆకుల అనిల్, మరికంటి శ్రీనివాస్, అజీజ్ పాషా, మల్కి సంపత్ కుమార్, పరశురాం, మహిళా అధ్యక్షురాలు శ్వేత, రేణుకతో పాటు రాజు, పోచయ్య, రాములు, కిషన్, వెంకటేష్, సురేందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ నిర్వాసులకు పూర్తి నష్ట పరిహారం ఇచ్చేంతవరకు మున్సిపల్ లో కలపొద్దు



**సామాన్యుడి అస్త్రం గజ్వేల్:** ప్రజ్ఞాపూర్ ఆర్ఎన్ఆర్ కాలనీల నివాసముంటున్నటువంటి పల్లెపహడు వేములగటుసింగారం ఎర్రవల్లి కిష్టాపూరుగ్రామాలను మున్సిపల్ లో కలపొద్దనిసిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ అన్నారు ప్రాజెక్టు నుండి కాళీ చేపించి సుమారు నాలుగు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఇల్లు రిజిస్ట్రేషన్ కాకపోవడం ప్యాకేజీలు పూర్తిస్థాయిలోపోవడంభూనిర్వాసులకు పూర్తి న్యాయం చేయకముందే మున్సిపల్ లో కలపడంవిడ్డూరంగా ఉంది దీన్ని ఇట్టి విషయంపై భూ నిర్వాసుల నిర్ణయం తీసుకోకుండా అధికారులు మరియుము న్సిపాలుక మిషనరుఏక పక్షనిర్ణయం తీసుకొని వార్డులు విభజించడంసరికా దుగతంలోమల్లన్నసాగరు గ్రామపంచాయతీమాజీసర్పంచులు అందరూ కలిసితీన్మారంలెటరు రాసిగ్రామపంచాయితీగా కొనసాగాలని కోర్టులో కేసు కూడా వేశారు కోర్టు నుండి ఎలాంటి తీర్పు రాకముందే మున్సిపల్ లో కలపడం సరైనది కాదు పూర్తి నష్టపరిహారం ఇచ్చారని మున్సిపల్ గా కొనసాగించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు స్వర్గం రాజేష్ రుద్రారం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలి

శీతాకాలం అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు




**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** సింగరేణి కాంటాక్ట్ కార్మికులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సదస్సులో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కాంటాక్ట్ కార్మికులుగా పనిచేస్తూ ఏండ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్నారని కానీ వారికి లాభాల్లో వాటా గాని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో సింగరేణి యాజమాన్యం పూర్తి వైఫల్యం చెందిందని అన్నారు. కార్మికులు వారి రక్తాన్ని శ్రమగా చేసి సింగరేణి అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని వారికి మాత్రం కనీస వేతన చట్టం అమలు కావటం లేదని ఈరోజు వాళ్లు వాళ్ల శ్రమలో నుంచి వచ్చే పీఎఫ్ తప్ప వారికి మరొక ఆదాయం లేదని సింగరేణి యాజమాన్యం దీనిపై జోక్యం చేసుకొని వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని అన్నారు. అనంతరం తోటి కార్మికుడు దేవుళ్ళ భద్రయ్య రిటైర్మెంట్ సాల్వ్ కప్పి కార్మికులు సన్మానించారని భవిష్యత్తులో ప్రభుత్వమే ఇటువంటి కార్యక్రమాలు చేయాలని అప్పుడే వాళ్ళ శ్రమకి ఫలితం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేకాస జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం నాయకులు హిమంబి, ఆదిలక్ష్మి, శ్రీవాణి, నరసింహారావు, బుక్కొండ సమ్మన్న, బుక్య రాందాస్, సింగరేణి మాజీ నాయకుడు సిపిఎం పార్టీ ఆఫీస్ కార్యదర్శి నరసయ్య తదితరు కార్మికులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో గడ్డం లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిని రవి, పొన్నగంటి మల్లయ్య, శ్రీపతి నరేష్ కుమార్, ప్రశాంత్, రవి తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరిపారు. లక్ష్మణ్ కుమార్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండి మరింత ప్రజాసేవ చేయాలని, ఆయుష్షు ఆరోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, పాల్గొన్న వారు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## కేఎల్ఆర్ కాలేజీ బస్సు ప్రమాదం పై చర్యలు తీసుకోవాలి

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారుల జీవితాలతో

చెలగాటం ఆడిన కేఎల్ఆర్ కాలేజి యాజమాన్యం పై

చట్ట రీత్యా

చర్యలు చేపట్టాలి

ప్రమాదానికి గురైన వారిలో అధిక సంఖ్యాక విద్యార్థులు

పేదవారే వారికి తగిన నష్టపరిహారం కాలేజీ

యాజమాన్యం

తక్షణమే అందించడానికి సంబంధిత అధికారులు

ప్రత్యేక చొరవ చూపాలి

ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ సిడెంట్ నాగెల్లి



**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** మణుగూరు పట్టణ ప్రాంతం నుంచి శుక్రవారం ఉదయం ఇంజనీరింగ్ విద్యార్థులతో పాల్వంచ కు బయలు దేరిన కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కాలేజి బస్సు మొండికుంట అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై బోల్తా పడడం అత్యంత బాధాకరం అని ఇద్దరు సింగరేణి కార్మికుల పిల్లలతో పాటు వివిధ రంగాల్లో పని చేసే వారి పిల్లల పరిస్థితి కూడా అత్యంత విషమంగా ఉందని ప్రమాదం పై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. “అవసరం ఉన్నంత వరకు రా మల్లయ్య అవసరం తీరిన తర్వాత బోడ మల్లయ్య“ చందంగా కెఎల్ఆర్ కాలేజీ నిర్వాహకుల పరిస్థితి ఉందని ఆయన మండిపడ్డారు. ధనార్జనే ధ్యేయంగా ఉజ్వల భవిష్యత్తు ఉన్న భావి భారత పౌరుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికులు, ఇతర రంగాల్లో పని చేసే పేద బడుగు బలహీన వర్గాల వారంతా పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం రెక్కలు ముక్కలు చేసుకొని కష్టించి పని చేసి సంపాదించిన సొమ్ము ను పిల్లల ఉన్నత చదువుల కోసం వారి బంగారు భవిష్యత్తుకు కోసం కాలేజీ నిర్వాహకులు పిఆర్వో సిస్టమ్ ను ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి పిల్లలను కాలేజీలో చేర్పించుకొని కమిషన్లు పొందుతున్నారని అడ్మిషన్ పొందిన తర్వాత కొన్ని రోజుల వరకు రంగుల హరివిల్లులు చూపెట్టి అడ్మిషన్ లు ముగింపు అయ్యాక తల్లిదండులకు, పిల్లలకు నరకం చూపిస్తున్నారని ఆయన తెలిపారు. బాంబే కాలనీ, పీవీ కాలనీ ఏరియా కార్మిక పిల్లలు కోసం ప్రత్యేక బస్ ఏర్పాటు చేసిన కెఎల్ఆర్ యాజమాన్యం కొన్ని నెలలు నుంచి కాలనీ బస్ సర్వీస్ పూర్తిగా రద్దు చేసి మణుగూరు ఏరియా పట్టణం మీదుగా వెళ్ళే కాలేజీ బస్ సర్వీస్ కు కాలనీ ఏరియాకు చెందిన కార్మికుల పిల్లలు రావాలని కాలేజీ నిర్వాహకులు తెలుపడంతో కొన్ని నెలలుగా మణుగూరు పట్టణం మీదుగా వెళ్ళే బస్ సర్వీస్ లోనే కాలనీ ఏరియా కు చెందిన కాలేజీ పిల్లలు రాకపోకలు సాగించారని రెండు బస్సుల్లో ప్రయాణం చేయవలసిన విద్యార్థులు ఒకే బస్సు పై ప్రయాణం చేయడం బస్ పరిధి మించి పిల్లలు ఎక్కించి ప్రయాణం చేయడం వల్లనే ప్రమాదం సంభవించిందని ఆయన తెలియచేశారు. పీవీ కాలనీ కార్మిక పిల్లల కోసం ప్రత్యేక బస్ నడపాలని కాలేజీ నిర్వాహకులకు ఎన్ని సార్లు తల్లిదండ్రులు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని ఫీజుల మీద ఉన్న శ్రద్ధ పిల్లల రక్షణ పై లేదని ఎవ్వరు పట్టించుకోకపోవడం వలనే ఈ ప్రమాదం సంభవించిందని ఆయన తెలియచేశారు. పూటకో బస్సు సర్వీసులు మారుస్తూ ఫిట్ నెస్ లేని వాహనాలను, అవగాహన లేని డ్రైవర్ లను పెట్టి కాలం నెట్టుకొస్తూ కాసులు దండుకుంటున్నారని ఇలాంటి కాలేజీ నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టి కాలేజీ గుర్తింపులను రద్దు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన కార్మికుల పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన తెలియచేశారు. కాలేజీలో అడ్మిషన్ చేర్చుకోవడానికి వచ్చిన వారి నుంచి మొదలు నేడు బస్ ప్రమాదానికి గురి కావడానికి కారకులైన ప్రతి ఒక్కరి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అమ్మవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా జీవించాలి

నూతన సంవత్సరం సందర్భంగా భవాని మాత అమ్మవారి ఆలయాల సందర్శించిన

సింగరేణి సివిల్ డీజీఎం శివ ప్రసాద్‌లి



**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** భవాని మాత అమ్మవారి ఆశీస్సులతో అందరూ సంతోషాలతో జీవించాలని నూతన సంవత్సరములో అందరికీ మంచి జరగాలని మణుగూరు ఏరియా సింగరేణి సివిల్ డీజిఎం శివప్రసాద్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా గురువారం నాడు ఆయన ఏరియాలోని సింగరేణి రైల్వే ట్రాక్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ భవాని మాత అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ భవాని మాత అమ్మవారికి వస్త్రాలు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి అనేది క్రమశిక్షణతో కూడి ఉండాలనీ ఎప్పుడైతే మనం భక్తి పట్ల క్రమశిక్షణతో కూడి ఉంటామో మనం నిర్వహించే పనులలో కూడా ఆ క్రమశిక్షణ మమేకమై ఉంటుందనీ క్రమశిక్షణ అనేది మన సంస్థ ఎదుగుదలతో పాటు, మనతో పాటు, మన కుటుంబాలు కూడా ఉన్నతమైన ఎదుగుదలకు తోడ్పడుతుంది అన్నారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పనిలో అనుక్షణం అప్రమత్తతో వ్యవహరించాలని, డైరెక్టర్ నిర్వహణలో నెంబర్ వన్ అనిపించుకోవాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ డివైసి ప్రవీణ్, సివిల్ సూపర్వైజర్స్ జె.నవీన్, వి.రవివర్మ, సివిల్ కాంట్రాక్టర్ రామచంద్రన్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు ఏ.మంగీలాల్, కె.రవికుమార్, యు.శివరామకృష్ణ, ఎస్కె రాజబల్లి, ఎం.సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మఠం ఆశ్రమంలో మానవత్వం వెల్లివిరిసింది

80 మంది పిల్లల ముఖాల్లో ఆనందం నింపిన హుకుంపేట సీఐ సన్యాసినాయుడు సేవా కార్యక్రమం



**సామాన్యుడి అస్త్రం హుకుంపేట :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మఠం ఆశ్రమంలో మానవత్వానికి అద్దం పట్టే సేవా కార్యక్రమం జరిగింది. హుకుంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఆశ్రమంలో నివసిస్తున్న 80 మంది పిల్లలకు చికెన్ బిర్యానీ విందు ఏర్పాటు చేయడం ద్వారా వారి ముఖాల్లో ఆనందం నింపారు. సేవాభావంతో ముందుకు వచ్చిన సీఐ సన్యాసినాయుడు, కేవలం ఒక రోజు భోజనంతోనే కాకుండా, ఆశ్రమంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా విశేషంగా తోడ్పడ్డారు. ఇటీవలే ఆశ్రమ అవసరాలను గుర్తించి నాలుగు ఫ్యాన్లు, వాటర్ ట్యాంక్ ఏర్పాటు, బాత్‌రూమ్‌లకు అవసరమైన బకెట్లు అందజేత, అలాగే పరిశుభ్రతకు దోహదపడేలా డ్రైనేజీ పైపుల ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసు వ్యవస్థ కేవలం చట్ట పరిరక్షణకే పరిమితం కాదని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచే సామాజిక బాధ్యతను కూడా సమర్థంగా నిర్వర్తిస్తుందని మరోసారి నిరూపితమైంది. చిన్నారులతో కలిసి భోజనం చేస్తూ, వారి అవసరాలను అడిగి తెలుసుకున్న సీఐ సన్యాసినాయుడు మనస్ఫూర్తి సేవలు అక్కడున్న వారందరినీ కదిలించాయి. ఆశ్రమ నిర్వాహకులు, స్థానికులు ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని ప్రశంసలు కురిపించారు. పిల్లల చిరునవ్వులే నిజమైన అవార్డు అన్నట్టుగా, హుకుంపేట సీఐ మానవత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచారు. ఈ కార్యక్రమం లో ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ భూమా రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం జిల్లా కోశాధికారి మఠం చిన్నరామ్ నాయుడు, కాఫీ బోర్డు డిఈఓ నందోలి శివకృష్ణ, నిలయప్రముఖ్ లు దుర్గ శ్రీ, సాయి ప్రసాద్, దేవి, పుష్ప, మోద కొండమ్మ విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు

## జిల్లా ఆస్పత్రి వద్ద అన్న ప్రసాద వితరణ

చింతకింది స్ఫూర్తి జన్మదిన సందర్భంగా




**సామాన్యుడి అస్త్రం జనగామ** చింతకింది స్ఫూర్తి జన్మదిన సందర్భంగా తల్లిదండ్రులు రఘునాథ్ పల్లి మండల సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి రాజేశ్వరి జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా తమ కూతురు జన్మదిన వేడుకలు జరిపించారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణీకుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న స్ఫూర్తి చిట్టితల్లికి జనగామమ్మ ఫౌండేషన్ టీం తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ రఘునాథపల్లి నుండి సేవా కార్యక్రమాన్ని సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా సమాజంలో మనల జీవిస్తున్న నిరాశ్రయులకు మతిస్థిమితం లేని వారికి అనాథలు నిరుపేద కుటుంబాలకు తోచినంత చేయూతనందించి అండగా నిలబడాలని ప్రజలు యువత మీ మీ గ్రామస్థాయి మండల స్థాయి నియోజవర్గ స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములై భారతదేశంలో ఆకలి చావులు లేకుండా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భాగస్వాములు కావాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, బింగి నరసింహులు, ఎండి యాకూబ్, కొయ్యడ విశ్వ, తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి బరిలో మాస్ మహారాజా.. హుషారెత్తిస్తున్న 'వామ్మో.. వాయ్యో..' సాంగ్



మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. క్లాస్ చిత్రాల దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మేకర్స్ తాజాగా ఈ సినిమాలోని 'వామ్మో.. వాయ్యో..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా తనదైన మాస్ బీట్స్‌తో స్వరపరిచిన ఈ పాటకు దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతిరెడ్డి తన గాత్రంతో పాటకు మరింత హుషారుని తీసుకువచ్చారు. రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం కిషోర్ తిరుమల మార్కు ఎమోషన్స్‌తో పాటు, రవితేజ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా సాగే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది.



# 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ డేట్ ఫిక్స్..

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12, 2026న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## ఆది సాయికుమార్‌కు పెద్ద హిట్.. వారం రోజుల్లోనే..




హిట్టు కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నాడు హీరో ఆది సాయికుమార్. తన కంటే ఎక్కువగా అతడి తండ్రి, నటుడు సాయికుమార్ నిరీక్షిస్తున్నాడు. వీరి ఎదురుచూపులకు తెరదించుతూ 2025 ముగింపులో భారీ విజయం సొంతమైంది. శంబాల సినిమాతో ఆది హిట్టు కొట్టాడు. తండ్రి సినీ జర్నీ మొదలై 50 ఏళ్లు పూర్తయిన సమయంలో ఈ సక్సెస్ రావడం మరింత విశేషం!

**వారం రోజుల్లోనే అన్ని కోట్లా?**

శంబాల విషయానికి వస్తే ఆది హీరోగా, అర్చన్ అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. యుగంధర్ ముని దర్శకత్వం వహించగా మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. ఈ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించాడు. ఈ మూవీ క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేవలం వారం రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.16.20 కోట్లు రాబట్టింది. ఇప్పటికీ థియేటర్లలో విజయవంతంగా ఆడుతోంది. శంబాల సక్సెస్‌తో ఆదికి మంచి బూస్ట్ దొరికినట్లయింది!

## బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా..

# వన్డే, టీ20 సిరీస్ తేదీలు ఇవే..!

భారత్, బంగ్లాదేశ్ వైట్‌బాల్ సిరీస్ కొత్త తేదీలు వచ్చేశాయి. పొరుగుదేశంలో నిరుడు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన సిరీస్ సెప్టెంబర్ నెలలో జరుగనుంది. ఈ విషయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో వాయిదా పడిన బంగ్లాదేశ్, టీమిండియా వైట్‌బాల్ సిరీస్ తేదీలను రీషెడ్యూల్ చేశాం. సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానుంది అని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తెలిపాడు. కొత్త ఏడాదిని పురస్కరించుకొని శుక్రవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026లో అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్, న్యూజిలాండ్, భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక సిరీస్ తేదీలను బీసీబీ ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాలో వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం భారత బృందం ఆగస్టు 28న బంగ్లాకు వెళ్లనుంది. అనంతరం సెప్టెంబర్ 1న తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొడుతుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ అవుతుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సిరీస్ ముగుస్తుంది.

**అల్లర్ల నేపథ్యంలో..**



నిరుడు ఆగస్టులోనే టీమిండియా వైట్‌బాల్ సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లాల్సింది. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ, మాజీ ప్రధాని షేక్ హసీనా(రాష్ట్రపతిఎన్నిక ఝంఅఖు)కు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లతో పర్యటనను బీసీసీఐ వాయిదా వేసింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక సిరీస్‌ను నిర్వహించాలని ఇరుదేశాల బోర్డులు భావించాయి. బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం.. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. అందుకనే కొత్త ఏడాది రెండో రోజునే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైట్‌బాల్ సిరీస్ తేదీలను ప్రకటించింది.

## డ్రాగన్ వేషంలో యూనివర్సల్ బాస్.. కొత్త ఏడాదికి స్వాగతం అదిరింది..!



వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్ ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ సంచలనం. అతడు క్రీజులోకి వచ్చాడంటే బౌలర్లు వణికిపోయేవాళ్లు. దంచడమే డ్యూటీగా భావించే ఈ డాషింగ్ బ్యాటర్ నెలకొల్పిన రికార్డులు కోకొల్లలు. క్రికెటర్‌గా తన విధ్వంసక ఆటతో అభిమానులను అలరించిన గేల్.. ఈమధ్య తన ప్రత్యేక వేషధారణతో వైరలవుతున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ కరీబియన్ వీరుడు డ్రాగన్ వేషంలో.. కార్నివాల్ డాన్స్ వీడియోతో మరోసారి నెట్టింటిని షేక్ చేస్తున్నాడు. ఆల్‌టైమ్ దిగ్గజ ఓపెనర్లలో ఒకడైన క్రిస్ గేల్ కొత్త ఏడాది సందర్భంగా తమ ప్రాంత విశిష్టతను ప్రపంచానికి చాటాడు. డ్రాగన్ వేషధారణతో హుషారుగా డాన్స్ చేస్తూ మురిసిపోయాడీ యూనివర్సల్ బాస్. ఇన్‌స్టాగ్రామ్‌లో 'పుక్రి గ్యాన్ 2026' పేరుతో షేర్ చేసిన వీడియోలో కరీబియన్ మూలాలతో గిల్ కనిపించాడు. ఈ పదానికి 'ఏం జరుగుతోంది?' అని అర్థం. పక్షి రెక్కలను పోలిన డ్రాగన్ బొమ్మలను ధరించిన గిల్.. చేతిలో పొడవాటి కర్రతో చిందులు వేశాడు. మైదానంలో తన డేరింగ్ ఆటకు కేరాఫ్ అయిన ఈ మాజీ ఓపెనర్.. ఇప్పుడు సంప్రదాయ లుక్‌లో దర్శనమిచ్చి ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించాడు.

**వరల్డ్‌కప్ హీరో..**

జమైకాకు చెందిన గేల్ 1999లో క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అనతికాలంలోనే డేంజరస్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. టెస్టులు, వన్డేలు, టీ20లు.. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారించాడు.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్పిన్ సంచలనం.. యువ పేసర్‌కు పిలుపు..!



లయాషెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బోణీ కొట్టిన ఇంగ్లండ్ విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాకు షాకిచ్చిన బెన్ స్టోక్స్ సేన.. సిడ్నీలోనూ దూకుడే మంత్రగా ఆడనుంది. జనవరి 4న సిడ్నీలో జరుగనున్న చివరి టెస్టు కోసం ఇంగ్లండ్ కీలక మార్పులు చేసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం 12 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకుంటున్న బౌలింగ్ యూనిట్‌ను పటిష్ఠం చేసుకుంటూ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ మాథ్యూ పాట్స్ (వీఫ్ష్రవఙ్రాశీం)లకు చోటు కల్పించింది. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓటమితో యాషెస్ సిరీస్ సమర్పించుకున్న ఇంగ్లండ్ మెల్‌బోర్న్‌లో పంజా విసిరింది. కుర్ర పేసర్ జోష్ టంగ్ విజృంభణతో ఆతిథ్య జట్టును మట్టికరిపించిన బెన్ స్టోక్స్ బృందం.. సిడ్నీ టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. అయితే.. తొడకండరాల గాయంతో బాధపడుతున్న పేసర్ గస్ అట్కిన్సన్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. మెల్‌బోర్న్ ఓటమి నుంచి తేరుకొని విజయ గర్జన చేయాలనుకుంటున్న ఆసీస్ స్టీవ్ స్మిత్ సారథిగా బరిలోకి దిగనుంది. అయితే.. నాలుగో టెస్టు స్క్వాడ్‌లో ఆ దేశ బోర్డు ఏ మార్పులు చేయలేదు.

**ఇంగ్లండ్ తుది జట్టు :** జాక్ క్రాలే, బెన్ డకెట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జో రూట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), షోయబ్ బషీర్,బ్రైడన్ కార్సే, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.